సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 31 । మే । 2024



టన్ను చీనీ రూ.36,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36,500 పలికాయి. 494 టన్నులు చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



లాభాల బాటలో 'పురం' మార్కెట్

హిందూపురం మార్కెట్ యార్డు లాభాల బాట పట్టింది. చింతపండు, మిర్చి క్రయ విక్రయాలు జోరందుకోవడంతో మంచి ఆదాయం సమకూరుతోంది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

40.7°/23.5°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నాలుగైదు రోజుల్లో నైరుతి



అనంతపురం అగ్రికల్చర్: రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. గురువారం కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు నాలుగైదు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాష్ట్రమంతటా విస్తరించేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం వాతావరణ బులెటిన్ విడుదల చేశారు. మరోవైపు రాగల రెండు రోజులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు ఉన్నాయన్నారు. అయితే అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కూడా కురుస్తాయని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో 30 కిలోమీటర్ల మేర బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో నేరుగా ప్రవేశాలు

పరిగి: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో నేరుగా ప్రవేశానికి ముస్లిం మైనార్టీ విద్యార్థులు (బాల, బాలికలు) దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్, ఏపీఆర్‌జేసీ కొడిగెనహళ్లి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరగోరే విద్యార్థులు ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా నేరుగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె, కర్నూలు జిల్లాలో ఉన్న పాఠశాల, కళాశాలల్లో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రధానాచార్యులను సంప్రదించవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఏపీఆర్‌జేసీ (మైనార్టీ బాలురు) కర్నూలు 87126 25080, ఏపీఆర్ఎస్ (మైనార్టీ బాలురు) కర్నూలు 87126 25068, ఏపీఆర్ఎస్ (మైనార్టీ బాలికలు) కర్నూలు 87126 25070, ఏపీఆర్ఎస్ (మైనార్టీ బాలురు) గార్లదిన్నె 87126 25062 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

విత్తనం తీసుకొని పంట వేయకపోతే పథకాలు కట్

- జిల్లా వ్యవసాయాధికారి వైపీ సుబ్బారావు



తరలిస్తున్న విత్తనం గురించి ఆరా తీస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

నల్లమాడ: సబ్సిడీ విత్తన వేరుశనగ తీసుకొన్న రైతుల పేర్లు ఈ క్రాప్ బుకింగ్‌లో నమోదు కాని పక్షంలో వారి పేర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచి ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా పరిగణిస్తామని జిల్లా వ్యవసాయాధికారి వైపీ సుబ్బారావు హెచ్చరించారు. ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను ఎవరూ దుర్వినియోగం చేయకూడదన్నారు. మండలంలో విత్తన వేరుశనగ పంపిణీని గురువారం ఆయన పరిశీలించారు. వంకరకుంట నుంచి శీకివారిపల్లి వైపు వేరుశనగ బస్తాలతో వెళ్తున్న ఆటోను అడ్డగించి కాయలు ఎక్కడికి తీసుకెళ్తున్నదీ ఆరా తీశారు. ఒక రెవెన్యూ గ్రామం నుంచి ఇంకో రెవెన్యూ గ్రామానికి విత్తన కాయలు తీసుకెళ్లడం నిషేధమన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి రెడ్డివల్లిలో వేరుశనగ పప్పు ఆడించే మిషన్ (గోదాము)లను తనిఖీ చేశారు. రైతుల నుంచి విత్తన వేరుశనగ కాయలు కొనుగోలు చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమతి పాల్గొన్నారు.

సబ్సిడీ కాయలు కొనుగోలు చేస్తే చర్యలు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్న విత్తన వేరుశనగ కాయలను ఎవరైన కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు హెచ్చరించారు. గురువారం నల్లమాడ మండలం రెడ్డిపల్లి, ఓడీ చెరువు మండలం కొండకమర్ల గ్రామాల్లోని ప్రైవేటు వేరుశనగ మిల్లులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి విత్తన కాయలు కొనుగోలు చేస్తే మిల్లులు, వ్యాపారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తన కాయలు నిలువ చేస్తే సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యాపారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గురువారం జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా 11,821 మంది రైతులకు 8,863 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేశామన్నారు. విత్తన కాయలు నాణ్యంగా ఉన్నాయని, ఎక్కడైనా నాణ్యత లేకుంటే వెనక్కు ఇచ్చి మరో బస్తా తీసుకెళ్లచ్చన్నారు.

భారమవుతున్న బంధం

- చిలమత్తూరుకు చెందిన 20 ఏళ్ల యువతికి కర్ణాటకలోని బాగేపల్లి వాసితో వివాహమైంది. ఆరు నెలలకే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో పోలీసులను ఆశ్రయించారు. అయితే ఆ తర్వాత తరచూ గొడవలు పడుతూ కలిసి ఉండలేమని నిర్ణయానికి వచ్చి కోర్టు మెట్లెక్కారు.
- పెనుకొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు బెంగళూరులో ఓ మహిళతో వివాహమైంది. పెళ్లయిన పది రోజులకే అతనికి ఇంకో మహిళతో వివాహేతర సంబంధం ఉందని ఆరోపిస్తూ సదరు మహిళ పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కింది. ఇరు పక్షాల కుటుంబ సభ్యులు కలిసి సర్ది చెప్పినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించారు.
- పుట్టపర్తి మండలం జగరాజుపల్లికి చెందిన యువకుడికి అదే గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. అయితే ఆ మహిళ అదే గ్రామంలో మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండటంతో ఆమె నుంచి విడాకులు కావాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఆ కేసు ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది.

- భార్యాభర్తల మధ్య విడాకుల చిచ్చు
- కొంప ముంచుతున్న వివాహేతర సంబంధాలు
- చిన్న చిన్న విషయాలకే మరికొందరు దూరం
- గ్రామస్థాయి నుంచి రచ్చకెక్కుతున్న కేసులు



సాక్షి, పుట్టపర్తి : 'పెళ్లంటే నూరేళ్ల పంట'... మన పెద్దలు చెప్పిన ఈ నానుడి ప్రస్తుత కాలంలో అపహాస్యమవుతోంది. పట్టుమని ఏడాది కూడా కాపురాలు సాగట్లేదు. ప్రస్తుత హైటెక్ యుగంలో వేగంగా సాగిపోతోన్న కాలంలో వివాహ బంధం కూడా వేగంగా విడిపోతోంది. పెళ్లయిన మొదటి రోజు నుంచి విడాకులకు దరఖాస్తు చేసుకుంటున్న వారు ఎంతో మందే ఉన్నారు. మరికొందరు పిల్లలు పుట్టినా.. కలిసి ఉండలేక వేర్వేరుగా జీవితం వెళ్లదీస్తున్నారు. ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య విభేదాలకు సంబంధించి కొందరు ఎస్పీ కార్యాలయంలో 'స్పందన'ను ఆశ్రయించారు. మరికొందరు విడాకులు కోరుతూ కోర్టు మెట్లెక్కుతున్నారు.

వివాహేతర సంబంధాలతోనే..

భార్యాభర్తల మధ్య సయోధ్య కుదరక.. సర్దుకుపోయే గుణం తెలియక.. పెద్దల మాట లెక్క చేయక.. ప్రతి వారం పది జంటలు చొప్పున పోలీసులను ఆశ్రయిస్తున్నాయి. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయని.. కలిసి ఉండలేమని.. వేరుగా జీవించేందుకు ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇప్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే ఇందులో వివాహేతర సంబంధాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. భార్య లేదా భర్త.. అవతలి వ్యక్తిపై చేసే ఫిర్యాదులో కచ్చితంగా మరొకరితో సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులను స్థానిక పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేస్తున్నారు. కొందరు సర్దుకుని కాపురం చేసేందుకు అంగీకరించినా.. మరికొందరు మాత్రం కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా..

ఎన్నికల కోడ్ ముందు వరకూ ప్రతి సోమవారం జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'స్పందన'కు సగటున 80 – 100 వరకూ ఫిర్యాదులు వచ్చేవి. ఇందులో 20 శాతం ఫిర్యాదులు కుటుంబ సమస్యలే ఉండేవి. మిగతా అర్జీల్లో రెవెన్యూ, రస్తా సమస్యలు, ఉద్యోగాల పేరుతో నగదు దోపిడీ, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, వ్యవసాయ, విద్య, వైద్యం, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, సచివాలయ వ్యవస్థ తదితర అంశాలపై ఉంటాయి. పోలీసు కార్యాలయానికి మార్చి చివరి వారానికి మొత్తం 3,096 ఫిర్యాదులు వచ్చాయి. అందులో కుటుంబ కలహాల కేసులు 513 ఉన్నాయి.

అనాలోచిత నిర్ణయంతో..

తెలిసీ తెలియని వయసులో ఆకర్షణో.. ప్రేమో అర్థం చేసుకోలేక , ఆలోచించే పరిపక్వత లేక చాలామంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొత్త దాంపత్య జీవితంలోకి ఇష్టంగా అడుగు పెట్టినా.. చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసుకుని గొడవ పడుతున్నారు. ఆలోచన లేని ఆవేశంతో భార్యాభర్తలు విడాకులకు దరఖాస్తు చేస్తున్నారు. వివాదాలపై మొదట పెద్దలకు చెప్పి.. పంచాయితీలు చేసినా ఎక్కువ భాగం సర్దుకుపోవడం లేదు. ఆ తర్వాత దిశ పోలీస్‌స్టేషన్లు, గృహ హింస చట్టం కింద కేసుల నమోదు, అనంతరం పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి వెళ్లి విడిపోయే వరకూ వస్తున్నారు.

సర్దుకుపోతే మంచిది



ప్రతి మనిషికీ తోడు ఎంతో అవసరం. మంచి, చెడులను వివరించి చెప్పగలిగే స్నేహితుడు దొరికితే వారు చాలా అదృష్టవంతులు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్నేహితులుగా భావించాలి. అప్పుడే వారికి కలిగే చిన్న చిన్న సమస్యలను తెలుసుకోవడం సాధ్యం అవుతుంది. పెద్దలకు తెలియకుండానే.. ఏమనుకుంటారనో.. ఏమైనా చేస్తారనేమోనన్న భయం వీడి కుటుంబ పెద్దలకు సమస్య చెప్పి.. ఇంట్లోనే సర్దుకుంటే దంపతుల మధ్య సమస్యలు ఉత్పన్నం కావు. విడాకుల వరకూ వెళ్తే పిల్లలు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

రేపటి నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక

- 77,435 మందికి ఇంటికే పింఛన్
- 1,93,948 మందికి బ్యాంకు ఖాతాలకు జమ
- రూ.80.98 కోట్లు విడుదల

పుట్టపర్తి అర్బన్: వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులు తదితరులకు అందించే వైఎస్సార్ పెంఛన్ కానుకను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జూన్ 1వ తేదీన జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలకు, బ్యాంకు ఖాతాలేని వారికి ఇంటికే వెళ్లి పింఛన్ అందించేలా చర్యలు చేపట్టింది. మూడు రోజుల్లోనే వంద శాతం పింఛన్ పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఆయా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు మరోమారు ఆదేశాలు ఇచ్చింది.

2,71,383 మంది పింఛన్‌దారులు

జిల్లాలో మొత్తం 2,71,383 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారికి ప్రభుత్వం రూ.80.98 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో 77,435 మంది మంచం పట్టిన రోగగ్రస్తులు, నడవలేని దివ్యాంగులు, అనారోగ్య కారణాలతో పింఛన్లు పొందుతున్న వారికి ఇంటి వద్దకే పింఛన్ అందజేయనున్నారు. వీరి కోసం రూ.22.80 కోట్లు నిధులు డ్రా చేశారు. ఇక ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమం 1వ తేదీ ఉదయం నుంచే జరుగుతుంది. నగదు జమ కాగానే సంబంధిత లబ్ధిదారులకు ఎస్ఎంఎస్ ద్వారా సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఆ వెంటనే ఏటీఎం, క్యాష్ పాయింట్, బ్యాంకుల ద్వారా డబ్బును డ్రా చేసుకోవచ్చు. జిల్లాలో 1,93,948 మందికి రూ.58.18 కోట్ల నగదు జమ చేయనున్నారు. కాగా ఎవరికి పింఛన్ డబ్బు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు? ఎవరికి ఇంటి వద్ద పంపిణీ చేస్తారు? తదితర వివరాలతో కూడిన జాబితాలను ఆయా సచివాలయాల్లోని నోటీస్ బోర్డుల్లో ఉంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ

- ప్రతి అసెంబ్లీ కౌంటింగ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం/లేపాక్షి: ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో భాగంగా జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్ కేంద్రాల్లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. గురువారం హిందూపురం, లేపాక్షిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, బిట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కోసం ముందస్తుగానే అన్ని చర్యలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి అధికారులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు వెళ్లేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను సంబంధిత రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

పటిష్టంగా పోలీసు బందోబస్తు

నియోజకవర్గాల కౌంటింగ్ హాల్‌ను కలెక్టర్ పరిశీలించి బిట్ కళాశాల, లేపాక్షి గురుకుల పాఠశాల ప్రధాన ద్వారం వద్ద నిరంతరం బందోబస్తును పటిష్టంగా ఉంచాలన్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకూడదన్నారు. ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ గెజిటెడ్‌ను సూపర్‌వైజర్‌గా , ఒక కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ స్టాఫ్ ఒకరు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని కలెక్టర్ తెలియజేశారు. అలాగే ప్రతి టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, గెజిటెడ్‌ను కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని చెప్పారు. ఈటీపీబీఎస్‌కు సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక ఏఆర్‌ఓ ఉంటారన్నారు. ఈవీఎం ఓట్ల లెక్కింపు కేంద్రానికి, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బందికి, ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసగా ఏడు చొప్పున మొత్తం 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. ఆయా బ్లాక్‌లలో ఆ నియోజకవర్గాల లెక్కింపు జరుగుతున్న తీరు అందరికీ అర్థం అయ్యేలా స్పష్టంగా తెలియజేసే సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హిందూపురం ఆర్‌ఓ జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పెనుగొండ ఆర్‌ఓ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, కదిరి ఆర్‌ఓ వంశీకృష్ణ, మడకశిర ఆర్‌ఓ గౌరీశంకర్, పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ, ధర్మవరం ఆర్‌ఓ వెంకటశివసాయిరెడ్డితో పాటు ఆయా నియోజకవర్గాల సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

పుట్టపర్తి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్షల నిర్వహణాధికారి, జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన హైపవర్ కమిటీ అధికారి లక్ష్మీకాంతరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ రంజిత్‌నాయక్, డీఈసీ మెంబర్లు చెన్నకేశప్రసాద్, శ్రీనివాసరెడ్డి తదితరులతో కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్ సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలు ముగిశాయని, ఒకేషనల్ పరీక్షలు శుక్రవారంతో ముగుస్తాయన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం 3,112 మంది ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2,933 మంది హాజరయ్యారు. అలాగే 740 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 695 మంది హాజరైనట్లు చెప్పారు.

ఓ సాయి..
జయ జయ సాయి

ప్రశాంతినిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడు సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహా సమాధి చెంత చక్కటి భక్తిగీతాలతో సంగీత కచేరీ నిర్వహించారు. ఓ సాయి.. జయ జయ సాయి అంటూ సత్యసాయిని కీర్తించారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు 'జంతూనామ్ నరజన్మ దుర్లభం' పేరుతో ప్రదర్శించిన నాటిక అందరినీ అలరించింది.



జంతూనామ్ మానవ జన్మ దుర్లభం నాటిక ప్రదర్శిస్తున్న దృశ్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓట్ల లెక్కింపునకు ఆయా నియోజక వర్గాల పరిధిలో టేబుళ్లను సిద్ధం చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొదట పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రారంభం కానుంది. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం మడకశిర నియోజకవర్గానికి రెండు టేబుళ్లు, కదిరి నియోజకవర్గానికి నాలుగు, తక్కిన పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం, ధర్మవరం, రాప్తాడు అసెంబ్లీ నియోజక వర్గాలకు మూడేసి టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో మొత్తం పోస్టల్ బ్యాలెట్లు 17,584 ఓట్లు దాఖలయ్యాయి. వీటిని ఒక్కో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున అందజేసి లెక్కిస్తారు. అలాగే 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి, 40 శాతంపైన వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఫారం 12డి ద్వారా హోం ఓటింగ్ ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించడానికి ఒక్కో టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్, సూపర్ వైజర్ అసిస్టెంట్లు ముగ్గురు ఉంటారు. వీరితో పాటు వివిధ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లు ఒక్కో టేబుల్‌కు ఒకరు ఉంటారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు మొత్తం 1754 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ పంపిన వారిలో కేవలం 573 మంది మాత్రం ఉన్నారు. వీటి కోసం ఒక్కో నియోజక వర్గానికి ఒక్కో టేబుల్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు.

నియోజకవర్గం	పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	హోం ఓటింగ్ ఓట్లు	సర్వీస్ ఓట్లు
రాప్తాడు	3,556	387	408
మడకశిర	1,376	386	79
హిందూపురం	2,054	219	87
పెనుకొండ	2,240	279	203
పుట్టపర్తి	2,318	490	457
ధర్మవరం	2,628	369	258
కదిరి	3,412	377	262
మొత్తం	17,584	2,507	1,754

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


చంద్రమోహన్ (ఫైల్)

రొద్దం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దంలోని పాత ఎస్సీ కాలనీకి చెందిన చంద్రమోహన్ (30)కు భార్య గంగరత్నమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న చంద్రమోహన్ గురువారం వేకువజామున నొప్పి తీవ్రత భరించలేక ఇంటి సమీపంలో ఉన్న చింత చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి


మంగమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కొండంపల్లికి చెందిన మంగమ్మ బాయి (83)కు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వయస్సు పైబడడంతో చెవులు సక్రమంగా వినిపించక బాధపడుతున్న మంగమ్మ బుధవారం మధ్యాహ్నం తర్వాత బహిర్భూమికని గ్రామ శివారులోని రైలు పట్టాల వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన రైల్వే కీమెన్ సమాచారంతో గురువారం ఉదయం హిందూపురం జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ మురళి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతు అనుమానాస్పద మృతి


స్వామినాయక్ (ఫైల్)

పావగడ: తాలూకాలోని వైఎన్ హోసకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మేగలపాళ్యం తండా గ్రామానికి చెందిన రైతు స్వామి నాయక్ (40) దాబాస్ పేట తాలుకా బిల్లినకోటె గ్రామంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతిపై కుటుంబసభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పంటల సాగు కోసం రెండు మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో రూ.4 లక్షల వరకు అప్పు చేశాడు. తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు పండక అప్పులు తీర్చలేకపోయాడు. ఈ క్రమంలో మైక్రో సంస్థల ఒత్తిళ్లను తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లుగా సమాచారం. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంతోష్‌కుమార్ కుటుంబసభ్యులతో విచారణ చేపట్టారు. కాగా, 15 సంవత్సరాల క్రితం స్వామి నాయక్ గ్రామం వదిలి వెళ్లినట్లుగా స్థానికులు తెలిపారు.

లాభాల బాటలో 'పురం' మార్కెట్

- చింతపండు, మిర్చి క్రయవిక్రయాల్లో అగ్రస్థానం
- టార్గెట్‌ను మించి ఆదాయం


మార్కెట్‌కు వచ్చిన చింత పండు


ఎండుమిర్చి

హిందూపురం అర్బన్: హిందూపురం మార్కెట్ యార్డు లాభాల బాట పట్టింది. చింతపండు లావాదేవీలకు ఉమ్మడి రాష్ట్రంలోనే పెద్ద మార్కెట్‌గా ఖ్యాతిగాంచిన హిందూపురం మార్కెట్ యార్డు... మిర్చి క్రయవిక్రయాల్లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో వ్యాపార లావాదేవీల్లో కమీషన్ రూపంలో గణనీయమైన ఆదాయం సమకూరుతోంది. మార్కెట్‌లో ఈ నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహిస్తున్నారు.

లక్ష్యానికి మించి ఆదాయం

జిల్లాలోని మార్కెట్ యార్డుల చెక్‌పోస్టుల ద్వారా గత ఆర్థిక సంవత్సరానికి రూ.190 లక్షల ఫీజు వసూళ్లు లక్ష్యంగా నిర్దేశించుకోగా... ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.181 లక్షలు వసూళ్లయ్యాయి. ఇందులో సింహభాగం రూ.115.30 లక్షల వసూళ్లు కేవలం హిందూపురం మార్కెట్ ద్వారానే జరిగాయి. ఏటా సాధారణంగా నవంబర్, డిసెంబర్ నుంచి మిర్చి, చింతపండు క్రయవిక్రయాలు సాగుతుంటాయి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హిందూపురం మార్కెట్ యార్డులో మౌలిక వసతుల కల్పన శరవేగంగా సాగింది. అంతేకాక రైతులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం ఈ-నామ్ పద్ధతిలో క్రయవిక్రయాలకు అవకాశం కల్పించింది. దీంతో దేశంలోని ఏ ప్రాంతం వారైనా వేలంలో పాల్గొని సరుకు కొనుగోలు చేసే వెసులుబాటు దక్కడంతో ఊహించని విధంగా రైతులకు లాభాలు సమకూరాయి. దీంతో రైతులు పెద్ద ఎత్తున చింతపండు, మిర్చి దిగుబడులను హిందూపురం మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి విక్రయించారు.

పంట పండింది

మూడేళ్ల క్రితం కరోనాతో మార్కెట్‌కు సరుకు రావడం పూర్తిగా తగ్గింది. దాదాపు రెండేళ్లపాటు చింత, మిర్చి దిగుబడులు రాకపోవడంతో మార్కెట్ యార్డు ఆదాయం గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలోనే మార్కెట్ యార్డును నష్టాల బాట నుంచి గట్టెక్కించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రైతులకు లాభదాయకంగా ఉండేలా ఈ-నామ్ పద్ధతిలో క్రయవిక్రయాలకు శ్రీకారం చుట్టింది. దీంతో దళారీ వ్యవస్థకు పూర్తిగా అడ్డుకట్ట పడి, రైతుకు గిట్టుబాటు ధర లభ్యం కావడంతో హిందూపురం మార్కెట్ యార్డు క్రమంగా పుంజుకుంది. 2020-21, 2021-22లో హిందూపురం మార్కెట్ ఆదాయం గణనీయంగా తగ్గినా 2022-23, 2023-24లో నూతన పాలక వర్గం పగ్గాలు చేపట్టడం, మార్కెట్ కార్యదర్శి పర్యవేక్షణ, ఆపై ఉన్నతాధికారులు తనిఖీలతో నష్టాల బాట నుంచి లాభాల వైపుగా పయనం సాగింది.

నాలుగేళ్లలో కమీషన్ల ద్వారా హిందూపురం మార్కెట్‌కు సమకూరిన ఆదాయం ఇలా...

సంవత్సరం	చింతపండు (కింటాళ్లలో)	మిర్చి (క్వింటాళ్లలో)	మార్కెట్ ఫీజు (రూ.లక్షల్లో)
2020-21	54,392	12,221	రూ.62.6
2021-22	1,02,152	18,661	రూ.87.75
2022-23	1,06,034	8,376	రూ.92.30
2023-24	1,13,204	15,476	రూ.115.30

ధరలు నిలకడ



హిందూపురం మార్కెట్‌కు కరోనా తర్వాత ఈ ఏడాది చింత పండు, మిర్చి రికార్డు స్థాయిలో వచ్చింది. ధరలు సైతం ఈ ఏడాది నిలకడగా కొనసాగాయి. చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.33వేలతో అమ్ముడుపోయింది. అలాగే మిర్చి క్వింటా ధర రూ.28 వేల వరకు పలికింది. దీంతో ఈ సారి మార్కెట్‌కు ఆశించిన మేర సరుకు రావడంతో ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోగలిగాం.

– జి. చంద్రమౌళి, మార్కెట్ యార్డు కార్యదర్శి, హిందూపురం

లాభదాయకంగా సాగింది



మార్కెట్‌కు ఈ ఏడాది 1.13 లక్షల క్వింటాళ్లకు పైగా చింత పండు వచ్చింది. దీంతో కమీషన్ రూపంలో మార్కెట్ యార్డుకు ఆదాయం బాగా కలిసొచ్చింది. వ్యాపారులు సైతం ఈ ఏడాది మంచి ధరలు ఉంటాయని భావించి సరుకు కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచారు. దీంతో వ్యాపారం లాభదాయకంగా సాగింది. 700 లారీల వరకు సరుకు శీతల గోదాముల్లో నిల్వ ఉంది.

– వేణుగోపాలరెడ్డి, కోల్డ్ స్టోరేజ్ యజమాని, హిందూపురం

గ్రంథాలయ సేవలు సద్వినియోగం చేసుకోండి


గ్రంథాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కార్యదర్శి రమ

పుట్టపర్తి టౌన్: వేసవి సెలవులు వృథాకానివ్వకుండా ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తిలోని గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై పాఠకులతో ఆరా తీశారు. గ్రంథాలయాన్ని సందర్శించే విద్యార్థులు, పాఠకుల శాతం మరింత పెరగాలని గ్రంథాలయాధికారి ఆంజనేయులుకు సూచించారు. వేసవి విజ్ఞాన కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. అనంతరం పుట్టపర్తి మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ అంజయ్యను కలసి గ్రంథాలయానికి బకాయిపడ్డ పన్నులు చెల్లించాలని కోరారు.

శస్త్రచికిత్స వికటించి వివాహిత మృతి

హిందూపురం అర్బన్: స్థానిక శిల్పా నర్సింగ్ హోమ్‌లో శస్త్రచికిత్స వికటించి వివాహిత యశోద (35) మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు. గుడిబండ మండలం చిగతుర్పికి చెందిన యశోదకు నర్సింగ్ హోమ్‌లో శస్త్రచికిత్స నిర్వహించి గర్భసంచి తొలగించినట్లు తెలిపారు. అయితే ఆపరేషన్ వికటించి ఆమె మృతి చెందడంతో గురువారం ఉదయం ఆస్పత్రి వద్దకు చేరుకుని యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి


వ్యాక్సినేషన్ రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా బృందం

హిందూపురం టౌన్: జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన వయోజన బీసీజీ టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వయోజనులకు జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫక్రుద్దీన్, డీపీహెచ్ఎన్ ఈరమ్మ పిలుపునిచ్చారు. గురువారం హిందూపురంలోని ఆజాద్ నగర్, లక్ష్మీపురం తదితర సచివాలయాల్లో చేపట్టిన బీసీజీ వ్యాక్సినేషన్‌ను వారు పరిశీలించారు. ప్రతి గురువారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 65 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, ఇంతకు మునుపు టీబీ సోకిన వారు, వారి సంబంధీకులకు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు, ఇతరులకు ఈ టీకా తప్పనిసరిగా వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మంజుశ్రీ, పట్టణ సిహెచ్‌ఓలు ముస్తఫా, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీవకారక మందులు

- జీవనియంత్రణ ప్రయోగశాల ఏడీఏ బొమ్మిరెడ్డి పద్మలత



ల్యాబ్‌లో తయారు చేసిన ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్‌ఫ్లోరోసెస్


ఏడీఏ బొమ్మిరెడ్డి పద్మలత

అనంతపురం అగ్రికల్చర్: సస్యరక్షణ మందులుగా జీవకారక మందులు (బయోపెస్టిసైడ్స్) వినియోగంపై దృష్టి సారించాలని వ్యవసాయ, ఉద్యాన పంటల రైతులకు జీవనియంత్రణ ప్రయోగశాల (బయోలాజికల్ కంట్రోల్ ల్యాబ్-బీసీ ల్యాబ్) ఏడీఏ బొమ్మిరెడ్డి పద్మలత సూచించారు. అవగాహన రాహిత్యం, అధిక దిగుబడులు సాధించాలనే ఆలోచనతో ఇటీవల విచ్చలవిడిగా రసాయన, క్రిమిసంహారక మందుల వాడకం పెరిగి భూసారం పూర్తిగా తగ్గిపోయి రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు. రసాయనిక మందుల వినియోగం వల్ల భూమిలో పంటలకు మేలు చేసే సూక్ష్మక్రిములు, వానపాములు లాంటివి పూర్తిగా నశించిపోయినట్లు తెలిపారు. రాను రాను పంట దిగుబడులు కూడా బాగా తగ్గిపోవడంతో రైతులకు పెట్టుబడులు, నష్టాలు పెరిగాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జీవకారక మందులైన ట్రైకోడెర్మావిరిడీ, సూడోమోనాస్‌ఫ్లోరెసెన్స్ లాంటి వాటిని పంటల్లో విరివిగా వాడితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. జీవకారక మందులను అనంతపురంలోని జేడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న బీసీ ల్యాబ్‌లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కిలో ట్రైకోడెర్మావిరిడీ రూ.100, కిలో సూడోమోనాస్ రూ.150 చొప్పున రైతులకు అవసరమైనంత ఇస్తామని తెలిపారు. తక్కువ ఖర్చుతో లభించే వీటి ద్వారా వ్యవసాయ, ఉద్యాన, కూరగాయల పంటల సాగులో విత్తనశుద్ధి (సీడ్ ట్రీట్‌మెంట్), అలాగే వివిధ రకాల చీడపీడలు, తెగుళ్ల నివారణలో సస్యరక్షణ మందుగా వాడితే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. ప్రధానంగా వివిధ పంటలపై ఆశించే కాయకుళ్లు, మొదలుకుళ్లు, మాగుడు తెగులు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, ఎండుతెగులు, పసుపు కొమ్మ కుళ్లు, తెగుళ్లను నియంత్రించవచ్చన్నారు. వేరుశనగ పంటలో ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి ద్వారా వేరుకుళ్లు, పెప్పుశనగలో ఎండు తెగుళ్లు, వెలువ్వకుళ్లను సమర్థవంతంగా అడ్డుకోవచ్చునన్నారు. అలాగే మిరపలో వేరుకుళ్లు, టమాటలో కాండం కుళ్లు, దానిమ్మలో ఎండుకుళ్లు, పుచ్చకాయలో వేరు కుళ్లు, కనకాంబరము, లిల్లీలో వేరుకుళ్లు సమర్థవంతంగా నివారించుకోవచ్చని తెలిపారు. ఉద్యాన పంటల రైతులు రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి బయట వివిధ రకాల రసాయన, క్రిమిసంహారక మందులు వాడటం కన్నా ఈ మందులు వాడితే పెట్టుబడులు తగ్గి దిగుబడులు బాగా పెరుగుతాయన్నారు. ఆర్‌బీకే అసిస్టెంట్లు, వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి, మండల స్థాయి అధికారులు వీటిపై రైతుల్లో అవగాహన పెంచితే చాలా వరకు మేలు జరుగుతుందన్నారు.

వైభవంగా శయనోత్సవం


శయనోత్సవంలో ఉత్సవ మూర్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంటకరమణుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం రాత్రి ఆలయంలో శయనోత్సవం, సప్తప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, అలంకరణ పెద్ద ఎత్తున జరిగాయి. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన ప్రజలకు, కులసంఘాల వారికి, దాతలకు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తాం : ఎస్పీ

ధర్మవరం అర్బన్: హిందూపురానికి చెందిన యువ న్యాయవాది సంపత్ కుమార్‌ను హత్య చేసిన కేసులో నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేస్తామని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. గురువారం ధర్మవరం చెరువు సమీపంలో పడేసిన సంపత్‌కుమార్ మృతదేహాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. హతుడు సైతం పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, ఆయనపై కౌంటర్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో హతుడికి ఎవరెవరితో శత్రుత్వం ఉందో కుటుంబసభ్యుల ద్వారా తెలుసుకుంటామన్నారు. విచారణ పక్కాగా చేపట్టి సరైన ఆధారాలతో నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. ఇందు కోసం ప్రత్యేక బృందాలను రంగంలో దించినట్లు వివరించారు.

యువకుడి బలవన్మరణం


రాము (ఫైల్)

తాడిమర్రి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రిలోని ఎస్సీ కాలనీకి చెందిన సాకే తిరుపాల్, నారాయణ దంపతుల కుమారుడు రాము అలియాస్ రామ్మోహన్ (30)కు ఎనిమిదేళ్ల క్రితం రామగిరి మండలం గంతిమర్రికి చెందిన ప్రమీలతో వివాహమైంది. ట్రాక్టర్ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రాము మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ దంపతుల మధ్య గొడవ చేసుకుని భార్య పుట్టింటికి వెళుతుండేది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాము రాత్రి 7.30 గంటలకు క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఖాళీ డబ్బాను భార్యకు చూపించాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రాత్రి 10.30 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక రాత్రి 1.30 గంటలకు రాము మృతి చెందాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా - ఒకరి మృతి


మృతి చెందిన వీరేష్

రాయదుర్గం టౌన్: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం భైరవాని తిప్ప గ్రామానికి చెందిన వీరేష్ (30)కు భార్య, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే వీరేష్... అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ క్యాతప్పతో కలసి గురువారం ఉదయం విద్యుత్ స్తంభాలను తీసుకెళ్లేందుకు రాయదుర్గం వచ్చాడు. విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్‌లో లోడు చేసుకుని తిరుగు ప్రయాణంలో గుమ్మఘట్ట మండలం పూలకుంట వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. విద్యుత్ స్తంభాలు మీదపడడంతో వాటి మధ్య ఇద్దరూ ఇరుక్కుపోయారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను కాపాడి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి విమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి వీరేష్ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లా వ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం


మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం చేసినట్లు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు ఎస్పీ మాధవరెడ్డి వివరించారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా అన్ని జిల్లాల ఎస్పీలతో గురువారం డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ... కౌంటింగ్ రోజు, ఆ తర్వాత రోజు జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న భద్రతా చర్యలను వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలతో పికెట్లు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద రెండు కిలోమీటర్ల దూరం వరకూ రెడ్ జోన్‌గా ప్రకటించినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, శ్రీలత, కంజాక్షన్, శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, విక్రమ్, ఎస్ఐ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి:

కౌంటింగ్ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. కౌంటింగ్ విధుల నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో గురువారం తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, నేర ప్రవృత్తి కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గొడవలు జరిగే ప్రాంతాలను ముందుగా పసిగట్టి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కౌంటింగ్ పాసులు ఉంటేనే లోపలికి అనుమతించాలన్నారు. అభ్యర్థుల ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కౌంటింగ్ సెంటర్లలో ఏజెంట్లు దురుసుగా ప్రవర్తిస్తే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సైబర్ సెల్ సీఐ హేమంత్‌కుమార్, ఎలక్షన్ సీఐ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణం
- విషయం తెలిసి మందలించిన తల్లిదండ్రులు
- ప్రియురాలి మృతితో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కణేకల్లు: చదువుకునే వయసులో ప్రేమ సరైంది కాదని తల్లిదండ్రులు మందలించడంతో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం బెణికల్లు గ్రామానికి చెందిన కె.వర్షిత (17) మండల కేంద్రంలోని ఓ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ చదువుతోంది. ఇటీవల రాసిన పరీక్షల్లో తాను ఆశించిన మేర మార్కులు రాకపోవడంతో ఇంప్రూవ్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్షలు రాస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం ఫిజిక్స్ పరీక్ష రాసి ఇంటికెళ్లింది. అప్పటికే కొంత మంది ద్వారా కూతురి ప్రేమ వ్యవహారం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించారు. బుద్ధిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని హితవు పలికారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కెమిస్ట్రీ పరీక్ష రాసేందుకు కుమార్తె సిద్ధమవుతుండగా గమనించిన తల్లిదండ్రులు ఏ పరీక్ష రాయొద్దని, కళాశాల తెరిచే వరకూ కణేకల్లుకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. దీంతో స్నానం చేసి వస్తానంటూ బాత్‌రూంకు వెళ్లిన వర్షిత.. అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతసేపటికీ ఆమె బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు బాత్‌రూం తలుపు బద్దలుకొట్టి చూశారు. అప్పటికే విగతజీవిగా వేలాడుతున్న కుమార్తెను గమనించి, విషయం పోలీసులకు తెలిస్తే పరువు పోతుందని భావించి గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు ఘటనాస్థలానికెళ్లి ఆరా తీయడంతో మొత్తం విషయం వెలుగు చూసింది. ఇన్‌చార్జ్ వీఆర్వో దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కాగా, వర్షిత ఆత్మహత్య విషయం తెలియగానే కణేకల్లు కాలేజీలో ఫస్ట్ ఈయర్ చదువుతున్న ఓ విద్యార్థి సైతం యర్రగుంట వద్ద ఉదయం 11.50 గంటలకు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్న విద్యార్థిని స్థానికులు గుర్తించి కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు కుటుంబసభ్యులు బళ్లారికి తీసుకెళ్లారు.

రైలు నుంచి జారి పడి కర్నూలు జిల్లా వాసి మృతి

అనంతపురం సిటీ: బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్లొస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతిచెందాడు. మృతుడిని కర్నూలు జిల్లా హోళగుంద మండలం నాగరకన్వి గ్రామానికి చెందిన హరిజన నాగప్ప కుమారుడు సురేష్ (20)గా గుర్తించినట్లు అనంతపురం జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. తండ్రి పదేళ్ల క్రితమే చనిపోవడంతో తల్లి, ఇద్దరు తమ్ముళ్ల పోషణ భారం పెద్ద కుమారుడు సురేష్‌పై పడింది. ఇంటర్ వరకు చదువుకున్న సురేష్.. బెంగళూరుకు వెళ్లి ఏదైనా కంపెనీలో కార్మికుడిగా చేరాలనే ఆకాంక్షతో తన స్నేహితుడితో కలసి వెళ్లాడు. గురువారం ఉదయం హంపి ఎక్స్‌ప్రెస్ రైలులోని జనరల్ బోగీలో తిరుగు ప్రయాణమయ్యాడు. రైలు అనంతపురం రామ్‌నగర్ వద్దకు చేరుకోగానే డోర్ వద్ద నిలబడిన సురేష్ అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కీమెన్ గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి సురేష్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

విద్యార్థి దుర్మరణం

పుట్లూరు: టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణాచారి, సుశీలమ్మ దంపతుల కుమారుడు వర్దనాచారి (19) తాడిపత్రిలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం ఉదయం తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలసి ప్రాక్టికల్స్ పరీక్షకు హాజరయ్యాడు. తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తుండగా నాగిరెడ్డిపల్లి వద్దకు చేరుకోగానే నల్లమట్టిని పొలాలకు తరలిస్తున్న టిప్పర్ ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వర్దనాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ హేమాద్రి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందినట్లు సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.